బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు
- ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని గురువారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్, ఆలయ డైరెక్టర్లు, గ్రామ పెద్దలు, భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో భక్తులు శివ పార్వతులు, గంగాదేవికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పము, హారతీ, పుష్పాలంకారణ, పలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గణపతి పూజ. పుణ్యాహవచనము, ధ్వజారోహనము పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, గ్రామ పెద్దలు, భక్తులు ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయం ఎదుట ఉన్న గజ స్తంభానికి ప్రత్యేక పూజలు, త్రివృక్షాలు (రాగి, వేప, మేడి) చెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు మోదిని రాకేశ్, అల్లె రాకేశ్, స్వర్ణగంటి కన్నయ్య, కటికల జగన్ ముదిరాజ్, ఏపూరి సాయిలు, శ్రీశైలం, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, మాజీ సర్పంచ్ ఆనందం, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు కూన యాదయ్య, కాకి ఈశ్వర్‌ముదిరాజ్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, కాకి కుమార్, మునగపాటి నవీన్, గ్రామ పెద్దలు అంధ్యానాయక్, పూర్ణచంద్రారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఏకలవ్య, జంగయ్య, పరమేశ్, మక్కాజీ, సత్యనారాయణ, ప్రభాకర్, బాలయ్య, భిక్షపతి, సత్తయ్య, ఆశోక్, శ్రవణ్, మల్లేశ్, రాజు, చందు ముదిరాజ్, మైసయ్య, శ్రీకాంత్, ఆలయ ఈఓ మురళీకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకుడు వీరేశం, భక్తులు పాల్గొన్నారు.

నియామకం

మహేశ్వరం: చిన్న తూప్ర గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా సంకటి నాగరాజు ముదిరాజ్ ఎన్నికయ్యారు. గురువారం మండల పరిధిలోని చిన్న తూప్ర గ్రామంలో మత్స్యశాఖ అధికారి శివలీల అధ్యక్షతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాజమోని భిక్షపతి ముదిరాజ్, కార్యదర్శిగా సత్తు ఆశోక్ ముదిరాజ్, కోశాధికారిగా సత్తు భిక్షపతి ముదిరాజ్, డైరెక్టర్లుగా సూరంపల్లి ఆంజనేయులు ముదిరాజ్, రాజమోలి లింగం ముదిరాజ్, రాజమోని మురళీ ముదిరాజ్, సత్తు పాండు ముదిరాజ్, సంకటి శ్రీకాంత్ ముదిరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికైన సభ్యులకు అధికారి నియామక పత్రాలను అందజేశారు. నూతనంగా ఎన్నికైన సంకటి నాగరాజ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మత్స్యకారులకు సబ్సిడీ రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు సూరంపల్లి లింగం ముదిరాజ్, సంకటి దర్శన్ ముదిరాజ్, సూరంపల్లి రమేశ్, సంకటి శ్రీనివాస్ ముదిరాజ్, సంకటి తిరుపతయ్య ముదిరాజ్, నీరటి మహేశ్ ముదిరాజ్, సూరంపల్లి రంజిత్ ముదిరాజ్, రాజమోని అంజయ్య ముదిరాజ్ పలువురు పాల్గొన్నారు.



నాగరాజ్ ముదిరాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న మత్స్యశాఖ అధికారి శివలీల

మార్కెట్లో శివరాత్రి సందడి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మార్కెట్లో పండ్లకు గిరాకీ పెరిగింది.సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని రైతుబజార్ వద్ద పండ్ల కొనుగోలుదారులతో సందడిగా మారింది. వ్యాపారులు ఒక్కసారిగా పండ్ల ధరలను రెండింతలకు పెంచారని కొనుగోలుదారులు వాపోతున్నారు. - హుడాకాంప్లెక్స్





సరూర్‌నగర్ రైతుబజార్ వద్ద పండ్లను కొనుగోలు చేస్తున్న దృశ్యాలు

తమదైన శైలిలో రాణిస్తూ..

- జల్‌పల్లి మున్సిపాలిటీలో సత్తా చాటుతున్న మహిళామణులు
- కీలక పోస్టులలో వారే అధికం



జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం



హబీబున్నీసా, జల్‌పల్లి టీపీవో



ఇఫ్రత్ ఆయేషా, జల్‌పల్లి ఏఈ

పహాడీషరీఫ్: సమస్యలకు పుట్టినిల్లుగా ఉండే జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో విధులు నిర్వహించడానికి మగవారు సైతం వెనుక ముందు అవుతుంటారు. తాము విధి నిర్వహణ చేయలేమని బలవంతంగా వెళ్లిన సందర్భాలున్నాయి. అలాంటి మున్సిపాలిటీలో ప్రధాన పోస్టులలో ఉన్న మహిళా అధికారులు తమదైన శైలిలో రాణిస్తూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందులోనూ నిత్యం ప్రజలతో మమేకమై, జవాబుదారిగా ఉండే పోస్టులలో ఉన్నవారు ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ బెదిరిపోకుండా సంయమనంతో ముందుకు సాగుతున్నారు. మున్సిపాలిటీ కమిషనర్‌గా ఉన్న అల్లూరి వాణిరెడ్డి (స్పెషల్ గ్రేడ్ కమిషనర్) కొన్ని రోజుల క్రితమే బాధ్యతలు తీసుకున్నా సీనియర్ కావడంతో తనదైన శైలిలో సిబ్బంది నుంచి సైతం మన్ననలు అందుకుంటున్నారు. ఇక దాదాపు మూడేళ్లుగా టీపీవోగా ఉన్న హబీబున్నీసా ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ విధి నిర్వహణ కొనసాగిస్తోంది. రెండేళ్ల క్రితం శ్రీరాం కాలనీలో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తుండగా కబ్జారాయులు సిబ్బందిపై దాడి చేసి ఈమెపై కూడా దాడికి యత్నించారు. దీనికి జడుసుకోని ఆమె అక్రమ నిర్మాణాలను కూల్చివేయించి పోలీసులకు ఫిర్యాదు సైతం చేసింది. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏఈ ఇఫ్రత్ ఆయేషా సైతం అభివృద్ధి పనుల్లో భాగంగా నిత్యం బస్తీలలో తిరుగుతూ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల సమయంలో స్థానికులతో ఎదురయ్యే అభ్యంతరాలు స్వీకరిస్తూ వారికి నచ్చజెప్పుతూ మూడేళ్ల నుంచి సఫలీకృతులవుతున్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రజలకు మెజార్టీగా మహిళలే. జల్‌పల్లి మున్సిపాలిటీకి కింది నుంచి పైస్థాయి వరకు ఎక్కువ శాతం అధికారులు, ప్రజాప్రతినిధులుగా మహిళలే ఉండడం విశేషం. మొత్తం 28 మంది కౌన్సిలర్లకు గాను 17 మంది మహిళలే కౌన్సిలర్లుగా ఉన్నారు. ఇక స్థానిక తహసీల్దార్(బాలాపూర్)గా మాధవీరెడ్డి, స్థానిక డీసీపీ (మహేశ్వరం)గా డి.సునితారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, జిల్లా అదనపు కమిషనర్‌గా కూడా ప్రతీమా సింగ్‌నే ఉన్నారు.

కొత్త ఓటరు కార్డుల పంపిణీకి ఏర్పాట్లు



ఓటరు కార్డులను పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్న సిబ్బంది

కందుకూరు: కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జారీ అయిన ఓటరు కార్డులను పంపిణీ చేయడానికి ఆర్డీఓ కార్యాలయం అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో దాదాపుగా వేల మందికి సంబంధించిన ఓటరు కార్డులను పోస్టు ద్వారా పంపించడానికి సిబ్బందితో అధికారులు సిద్ధం చేయిస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వారంతా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ వెంకటేశ్



స్టీల్, సిమెంట్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: శిథిలమైన ఆలయాల మరమ్మతులతో పాటు నూతన ఆలయాల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్ అన్నారు. ట్రస్టు నిధుల ద్వారా స్టీల్, సిమెంట్, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను అందజేసి గుడి నిర్మాణం చేపడుతానని అన్నారు. మండల పరిధిలోని కొలికిరాళ్ల తండాలో తండావాసులు.. ముత్యాలమ్మ అమ్మవారి నూతన గుడి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో ఇటీవల వారు జెడ్పీటీసీని కలిసి ఆలయ నిర్మాణానికి ఆర్థికసహాయం అందజేయాలని కోరారు. తండావాసుల వినతి మేరకు గురువారం ట్రస్టు సభ్యులచే స్టీల్, సిమెంట్, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్, దేవులానాయక్, శ్రీశైలం, విఠల్, సంపత్, శ్రీను, రాజు, శంకర్, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్

- ప్రభుత్వ బడుల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన
- ఎన్నికలు, పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు



బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేస్తున్న విద్యార్థులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు పాఠశాల హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు పద్మలత, బోజయ్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నమూనా-2024 (మాక్ పోలింగ్) నిర్వహించారు. ఇందులో భాగంగా ఈనెల 4న గ్రామ పంచాయతీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 5న సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీచేసే అభ్యర్థులు(విద్యార్థుల) నుంచి నామినేషన్లు స్వీకరించారు. 6న పోటీచేసే అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. 7న ఉదయం 10 గంటల నుంచి మాక్ పోలింగ్ ప్రారంభించారు. మాక్ పోలింగ్‌లో విద్యార్థులు పోటీచేసే అభ్యర్థుల లాగా మరియు పోలీస్, జర్నలిస్టులుగా, పోలింగ్ సిబ్బందిగా వివిధ పాత్రలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరిగా మాక్ పోలింగ్ కూడా రసవత్తరంగా జరిగింది. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు పోలింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం గెలుపొందిన అభ్యర్థులు(విద్యార్థులు) విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ, శ్రీలత, మల్లీశ్వరి, వెంకట్‌రెడ్డి, మురళీధర్, పరమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎంపీపటేల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్ గూడ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించారు. ఎన్నికల్లో పోటీచేయడం, నామినేషన్లు, ప్రచారం, ఓటుహక్కు వినియోగం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, ఉపాధ్యాయులు యాదగిరిరెడ్డి, వెంకటేశ్, ఆంజనేయులు, సాలమన్, అరుంధతి, నాగలక్ష్మి, సునీత, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మీర్‌పేట: బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యులు పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ బి.చంద్రశేఖర్, ఆర్ఓ అంజన్‌రెడ్డి, వైద్యులు జి.వర్ష, అజిత్‌కుమార్, శ్రీదీప, శివతేజ, మాధవి, సోహైల్, స్టాఫ్‌నర్సు కృష్ణవేణి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయి చాలనుకున్నాం..

- ఆదర్శంగా నిలుస్తున్న తల్లిదండ్రులు
- ట్యూషన్‌లు చెబుతూ సేవలందిస్తున్న అక్షయదీవెన



కుమార్తె అక్షయదీవెనతో తల్లిదండ్రులు రాబర్ట్, సుహాసిని

కందుకూరు: ఒక్క ఆడపిల్లతోనే ఆపి ఆమెను పెంచడంతో పాటు పేద పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెబుతూ, భోజనం కూడా అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ జంట. మండల కేంద్రానికి చెందిన దంపతులు రాబర్ట్, సుహాసినిలకు ఒక్క కుమార్తె అక్షయదీవెన. ఆమె ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. కాగా ఆడపిల్లలైనా, మగ పిల్లలైనా సమానమనే భావనతో ఒక్కరితోనే ఆపినట్లు ఆ తల్లిదండ్రులు చెబుతున్నారు. కాగా ఆమె తండ్రి రాబర్ట్ చర్చి ఫాదర్‌గా పని చేస్తున్నాడు. భార్యభర్తలు ఇద్దరు తమ కుమార్తెతో పాటు పేద పిల్లలకు నిత్యం సాయంత్రం వేళలో ఉచితంగా ట్యూషన్లు చెబుతూ, భోజనం సైతం అందిస్తున్నారు. దాదాపుగా నిత్యం 40 నుంచి 70 మంది పిల్లలకు వారు తమ సేవలను అందిస్తున్నారు. ముగ్గురు, నలుగురు ఆడపిల్లలు పుట్టిన వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తూ అందరూ సమానమేనని ఆడపిల్లల పట్ల వివక్ష చూపొద్దంటూ అవగాహన కల్పిస్తుంటారు. ఎక్కువ మంది పిల్లలను కంటే సంపాదించడంతో పాటు స్వార్థం పెరిగి పేద పిల్లలకు సహాయం చేయలేమనే నిర్ణయంతో ఒక్క ఆడపిల్లతోనే సరిపెట్టుకున్నామంటున్నారు ఆ దంపతులు.



పేద పిల్లలకు ట్యూషన్లు చెబుతూ, బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్న దంపతులు

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి కూలీలకు సూచించారు. మండల పరిధిలోని నల్లవెల్లిలో గురువారం ఆయన ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. చేసిన పనులకు వేతనాలు బ్యాంకుల్లో జమ అవుతున్నాయా.. కూలీ గిట్టుబాటు అవుతోందా.. నిబంధనల ప్రకారం రోజుకు రెండుసార్లు ఫోటోలు తీస్తున్నారా.. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో జాబ్ కార్డులున్న ప్రతి కూలీకి కావాల్సిన పని ఉందని.. ప్రతి కూలీ ఉపాధి పనులకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎం ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ అధికారిగా శ్రీనివాసులు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ అధికారిగా ఇ.శ్రీనివాసులును నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఎస్.దేవేందర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులు వారంలో మూడు రోజులు (సోమవారం నుంచి బుధవారం) తుర్కయంజాల్‌లో విధులు నిర్వహించనున్నాడు.

వాటర్‌ట్యాంక్ అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మసీదు పక్కన ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ఆమనగల్లు లయన్స్ క్లబ్ సభ్యులు వీరబొమ్మ భిక్షపతి, రామ్మోహన్ వాటర్ ట్యాంకును అందించారు. పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో వీరబొమ్మ రామ్మోహన్ తన తల్లిదండ్రులు.. నారాయణ, లింగమ్మ స్మారకార్థం వాటర్‌ట్యాంక్‌ను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ఎల్‌ఆర్‌ఎస్ హామీ ఏమైంది?

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి
- ఆర్టీఓ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నేతల నిరసన

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ఆరోపించారు. గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో దరఖాస్తు చేసుకున్న పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఈనెల 31 లోగా గతంలో నిర్దేశించిన ఫీజులు చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వం హుకుం జారీ చేసిందని.. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత ఎల్‌ఆర్‌ఎస్ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని ఉచితంగా అమలు చేయకుంటే పోరాటన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, బుగ్గరాములు, కిషన్‌గౌడ్, జంగయ్య, నాయకులు గణేష్, జగదీష్, వేణుగోపాల్‌రావు, బహదూర్, రవీందర్, సురేష్, నర్సింహారెడ్డి, రాజు, రాజ్‌కుమార్, జానీపాషా, శంకర్, చిన్నా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.